

'మహా' ఎన్నికల్లో పేకాట డబ్బు

తెలంగాణలో పేకాటకు నిషేధం ఉండగా.. నిర్వాహకులు మహారాష్ట్రకు మకాం మార్చారు. ఎన్నికల కోడ్‌లోనూ అక్కడ పేకాట క్లబ్‌లు నడుస్తున్నాయి. 10లో▸



దండారీ సందడి

ఆదివాసీ గ్రామాల్లో దండారీ సందడి మొదలైంది. గిరిపుత్రులు ఎత్మసూర్ పూజల్లో నిమగ్నమయ్యారు. గుస్సాడీ నృత్యాలు ఆకట్టుకున్నాయి. 11లో▸



వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి పోటీల్లోనూ సత్తా చాటాలి



పోటీలను ప్రారంభిస్తున్న పార్థసారథి

ఆదిలాబాద్: రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లోనూ జిల్లా క్రీడాకారులు సత్తా చాటాలని జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి అన్నారు. స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో సోమవారం నిర్వహించిన ఎస్జీఎఫ్ అండర్-14, 17 బాలబాలికల జోనల్‌స్థాయి స్విమ్మింగ్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లా, జోనల్‌స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైన వారు, అందులోనూ మెరుగ్గా రాణించాలని ఆకాంక్షించారు. ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కాంతారావు మాట్లాడుతూ, ఇందులో ఎంపికైన క్రీడాకారులు నవంబర్ 2 నుంచి 4వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోటీల ఆర్గనైజర్ రాష్ట్రపాల్, శిక్షకుడు కొమ్ము కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాగు నీరందించాలని ఆందోళన

- ఖాళీ బిందెలతో కేఆర్‌కే కాలనీవాసుల నిరసన



ఖాళీ బిందెలతో మహిళలు

కైలాస్‌నగర్: తమ కాలనీకి తాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని కేఆర్‌కే కాలనీవాసులు సోమవారం ఆందోళన చేపట్టారు. మహిళలు కలెక్టర్ క్యాంపు కార్యాలయం ఎదుట బైఠాయించి ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశా రు. విషయం తెలుసుకుని అక్కడికి చేరుకున్న పోలీసులు కలెక్టర్‌ను కలిపిస్తామని సర్దిచెప్పడంతో వారు ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ, గత సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టగా సమస్యను పరిష్కరిస్తామని అదనపు కలెక్టర్ హామీ ఇచ్చారన్నారు. రెండు రోజుల పాటు సక్రమంగా పంపిణీ కాగా తర్వాత పరిస్థితి మళ్లీ మొదటికే వచ్చిందన్నారు. మిషన్ భగీరథ అధికారులు తమ కాలనీపై ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అంతుపట్టడం లేదన్నారు. ఉన్నతాధికారులు చొరవ చూపి సమస్యను పరిష్కరించాలని కోరారు.

డబుల్ ఇంజిన్ సర్కారుతోనే ప్రగతి



నామినేషన్ ర్యాలీలో ఎంపీ నగేశ్

ఆదిలాబాద్: డబుల్ ఇంజిన్ సర్కారుతోనే ప్రగతి సాధ్యమని ఎంపీ గోడం నగేశ్ అన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం చంద్రపూర్ శాసనసభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి కిశోర్ జర్గేవార్ నామినేషన్ ర్యాలీలో పాల్గొన్నారు. డబుల్ ఇంజిన్ సర్కారు అధికారంలోకి వస్తేనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని, బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. అంతకు ముందు ఆయన జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారాం అహిర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట పార్టీ జిల్లా అధ్యక్షుడు రాహుల్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, పక్కన సభ్యులు, కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు

కులాల లెక్క తేల్చేందుకే.. సర్వే

- అది తేలాకే దామాషా ప్రకారం రిజర్వేషన్లు
- బీసీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ జి.నిరంజన్
- ఆదిలాబాద్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి ప్రజాభిప్రాయ సేకరణ



వినతులు ఇచ్చేందుకు వివరాలు నమోదు చేసుకుంటున్న బీసీ సంఘాల ప్రతినిధులు

కైలాస్‌నగర్: జనాభాలో ఏ కులం ఎంత ఉంది.. అందులో బీసీలు ఎంత మందో లెక్క తేల్చేందుకోసమే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉపాధి సమగ్ర కుటుంబ సర్వే నిర్వహిస్తోందని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ అన్నారు. సమాజంలోని అన్ని కులాలవారు త్వరలో తమ ఇంటి వద్దకు వచ్చే ఎన్యూమరేటర్లకు తమ కులంతోపాటు వారడిగే సమగ్ర సమాచారం అందించాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలనే అంశంపై ఆదిలాబాద్ జెడ్పీ సమావేశ మందిరంలో సోమవారం బహిరంగ విచారణ చేపట్టారు. బీసీ కమిషన్ సభ్యులు రాపోల్ జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, రంగు బాల లక్ష్మితో కలిసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాస్థాయి ప్రజాభిప్రాయాలు సేకరించారు. నాలుగు జిల్లాల నుంచి తరలివచ్చిన బీసీ సంఘాల ప్రతినిధులు, కులస్తుల నుంచి జిల్లాల వారీగా అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన కార్యక్రమం సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. సమయాభావం కారణంగా మిగిలిన వారి నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. ఆయా జిల్లాల పరిధిలో నుంచి మొత్తం 90 వినతులు అందాయి. కార్యక్రమంలో ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల కలెక్టర్లు రాజర్షిషా, అభిలాష అభినవ్, కుమార్ దీపక్, అలాగే ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, దాసరి వేణు తదితరులు పాల్గొన్నారు. దరఖాస్తులు అందించేందుకోసం వచ్చిన వారికి ఇబ్బందులు తలెత్తకుండా హెల్ప్‌డెస్క్, రిజిస్ట్రేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. టోకెన్లు అందజేసి లోనికి అనుమతించారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకో కుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

కమిషన్ దృష్టికి పలు అంశాలు

ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా బీసీలే కాకుండా ఇతర కులస్తులు సైతం తమ అభిప్రాయాలను కమిషన్ దృషికి తెచ్చారు. తమ కులాల సంఖ్య తక్కువగా ఉన్నందున వెనుకబడి ఉన్నామని, రాజకీయంగా గుర్తింపునివ్వాలని పలు సంఘాలు కోరాయి. ఆదిలాబాద్ జిల్లాలో ఎస్టీ జనాభా అధికంగా ఉన్నందున జెడ్పీ చైర్మన్ పదవీ ఎస్టీలకు రిజర్వు చేయాలనే విన్నవించారు. 'డీ' గ్రూపులో కొనసాగుతున్న పలు కులస్తుల వారు ఏ, బీ గ్రూపులకు మార్చాలని కోరారు. అలాగే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాకే ఎన్నికలు నిర్వహించాలనే విజ్ఞప్తులు అందాయి. బీసీ–ఈ గ్రూపులో మరింతమంది ముస్లింలను చేర్చాలని ఎంఐఎం నాయకులు కోరారు. రాష్ట్రంలోనే తొలిసారిగా చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతమైందని, ఆదిలాబాద్ కలెక్టర్ కృషితోనే ఇది సాధ్యమైందని రాజర్షి షాను చైర్మన్ ప్రత్యేకంగా అభినందించారు.

పారదర్శకంగా సర్వే..

అనంతరం విలేకరుల సమావేశంలో చైర్మన్ మాట్లాడారు. సర్వే ప్రకారమే కులాల వారీ గా రిజర్వేషన్లు ఖరారు చేయనున్నందున బీసీలు తమ కులాన్ని తప్పనిసరిగా ఎన్యూమరేటర్ల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. లేకుంటే నష్టపోయే అవకాశముందన్నారు. ఏ, బీ, సీ, డీ కేటగిరీల్లో ఏ కులాలు రావాలి, వారికి ఏ పర్సంటేజీలో రిజర్వేషన్లు కల్పించాలనే దానిపై పూర్వ పది జిల్లాల్లో బీసీ కమిషన్ నవంబర్ 13 వరకు ప్రజాభిప్రాయ సేకరణ చేస్తుందన్నారు. సర్వే వివరాలను డిసెంబర్ 9న ప్రభుత్వంతోపాటు హైకోర్టుకు అందజేయనున్నట్లు తెలిపారు. నిర్ణీత ప్రశ్నావళి ప్రకారం సర్వే ఉంటుందన్నారు. దరఖాస్తుపై కుటుంబ పెద్ద, ఎన్యూమరేటర్ సంతకం తప్పనిసరిగా ఉండాలన్నారు. సర్వే పారదర్శకంగా నిర్వహించి డాటాను భద్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణల్లేవు.. జాబ్‌మేళాల్లేవు!

- మూతపడ్డ ఈజీఎంఎం కార్యాలయం
- ఏడాదిగా ఖాళీగానే సిబ్బంది
- ఉపాధికి దూరమవుతున్న నిరుద్యోగ యువత
- నిధుల కొరతే కారణమంటున్న అధికారులు



జిల్లా కేంద్రంలోని టీటీడీసీలో మూతపడ్డ ఈజీఎంఎం కార్యాలయం

కైలాస్‌నగర్: గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు ప్రైవేట్‌రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నైపుణ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేది. ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ అండ్ మార్కెటింగ్ మిషన్ (ఈజీఎంఎం) ద్వారా ఉచిత శిక్షణతో పాటు శాఖాపరంగా జాబ్‌మేళాలు నిర్వహించి ఉపాధి అవకాశాలు కూడా కల్పించేది. అయితే ఏడాదిగా ఈ శిక్షణలన్నీ పూర్తిగా నిలిచిపోగా జాబ్‌మేళాలు సైతం లేకుండా పోయాయి. ఫలితంగా నిరుద్యోగ యువతకు అవకాశాలు కల్పించే విషయంలో సర్కారు లక్ష్యం నీరుగారుతోంది. మరోవైపు ఈ విభాగంలోని ఉద్యోగులు సైతం ఏడాదిగా ఖాళీగా ఉండటం గమనార్హం.

ఉద్దేశమేంటంటే..

దారిద్ర్యరేఖకు దిగువనున్న గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈజీఎంఎం ద్వారా మార్కెటింగ్ మెళకువలు, ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్, ప్లంబింగ్, శానిటేషన్, హోటల్ మేనేజ్‌మెంట్, కుట్టుమిషన్, కంప్యూటర్ స్కిల్, పరిశ్రమలకు సంబంధించిన పలు రంగాల్లో శిక్షణ కార్యక్రమాలు చేపట్టేవారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి పట్టణంలోని టీటీడీసీలో ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేశారు. శిక్షణకు అవసరమైన వసతులు కల్పించడంతో ముగ్గురు మాస్టర్ ట్రైనర్లు, ఓ డాటా ఎంట్రీ ఆపరేటర్‌ను నియమించారు. వీరితో పాటు ప్రైవేట్‌రంగంలోని ప్రముఖ కంపెనీలు, పరిశ్రమలను సంప్రదించి యువతకు ఉపాధి కల్పించేందుకు వీలుగా జాబ్‌మేళాలు నిర్వహించేందుకు గాను మరో ప్రత్యేక ట్రైనర్‌ను ఎంపిక చేశారు. వీరికి ఒక్కొక్కరికి ప్రతి నెలా రూ.21వేల వేతనం చెల్లిస్తున్నారు.

కరువైన శిక్షణలు

దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ్ కౌశల్ యోజన (డీడీయు–జీకేవై)లో భాగంగా ఈజీఎంఎం ద్వారా యువతకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చేవారు. 35 మంది యువత చొప్పున బ్యాచ్‌గా ఏర్పాటు చేసి స్థానిక టీటీడీసీలో 90 రోజుల పాటు ఆయా రంగాల్లో ఉచిత శిక్షణ ఇచ్చేవారు. భోజనంతో పాటు వసతి కల్పించేవారు. శిక్షణార్థులకు యూనిఫాం సైతం అందజేసే వారు. ఒక్కో అభ్యర్థికి రూ.20వేల నుంచి రూ.90వేల వరకు స్టైఫండ్ కూడా ఇచ్చేవారు. శిక్షణ అనంతరం వారికి ప్రైవేట్‌రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించేవారు. అయితే ఏడాదిగా ఈ శిక్షణలు నిలిచిపోయాయి. జాబ్‌మేళాల జాడ కరువైంది. ఈజీఎంఎం కార్యాలయం నిరుపయోగంగా మారింది.

ఉపాధి అవకాశాల్లేవు



ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన పరీక్షలకు తీవ్ర పోటీ ఉంటుంది. ప్రైవేట్ రంగంలోనైనా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశపడితే సర్కారు పరంగా అందించాల్సిన ఉచిత శిక్షణలు సైతం లేకుండా పోయాయి. గతంలో ఉచితంగా శిక్షణ ఇవ్వడంతో పాటు జాబ్‌మేళాల ద్వారా పరిశ్రమలు, ప్రభుత్వ సంస్థల్లో ఉపాధి కల్పించేవారు. ఈ శిక్షణలను నిలిపివేయడంతో నిరుద్యోగ యువతకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

–అజయ్, నిరుద్యోగి, గోట్కూరి, తాంసి

నిధుల కొరత కారణంగానే..



గతంలో శిక్షణతో పాటు జాబ్‌మేళాలు నిర్వహించిన మాట వాస్తవమే. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి బడ్జెట్ రాకపోవడంతో వాటిని నిలిపివేశాం. జిల్లాలోనే కాదు రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి. ఆ విభాగంలోని ఉద్యోగులను ఇతర విభాగంలోకి మార్చే అధికారం మాకు లేదు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ప్రభుత్వం నిధులను విడుదల చేస్తే వాటికనుగుణంగా తగు చర్యలు తీసుకుంటాం.

– సాయన్న, డీఆర్డీవో

భద్రమేనా..

- జనావాసాల్లో టపాసుల దుకాణాలు
- ఎన్‌వోసీ జారీకి ముందే ఏర్పాటు
- గోదాముల్లోనూ నిబంధనలు తూచ్..
- ప్రమాదాలు సంభవిస్తే బాధ్యులెవరు?



'రాంలీలా'లో దుకాణాల వద్ద భద్రతా ప్రమాణాలు పరిశీలిస్తున్న అగ్నిమాపక శాఖ అధికారులు

సాక్షి,ఆదిలాబాద్: హైదరాబాద్ బొగ్గులకుంటలోని టపాసుల దుకాణంలో ఆదివారం రాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం సంభవించకపోయినప్పటికీ భారీగా ఆస్తి నష్టం చోటు చేసుకుంది. దుకాణం పక్కనున్న బిల్డింగ్‌కు కూడా మంటలు వ్యాపించాయి. ఆ సమీపంలో ఉన్న పలు ద్విచక్ర వాహనాలు కాలి బూడిదయ్యాయి. భారీ శబ్దాలతో పాటు ఒక్కసారిగా మంటలు ఎగిసిపడటంతో చుట్టుపక్కల ఉన్న వారు భయాందోళనతో పరుగు తీశారు. దట్టమైన పొగ వ్యాపించడంతో ఇద్దరు మహిళలు అస్వస్థతకు గురయ్యారు. ఇప్పుడు ఈ విషయం ఎందుకు చెప్పాల్సి వస్తుందంటే.. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో 50 టపాసుల దుకాణాలు ఏర్పడ్డాయి. తాత్కాలిక అనుమతులతో వీటిని అక్కడ ఏటా ఏర్పాటు చేస్తున్నారు. ఇదిలా ఉంటే అగ్నిమాపక, పోలీసు, మున్సిపల్, విద్యుత్ శాఖల నుంచి అనుమతి తీసుకోవాలి. ఆ తర్వాత రెవెన్యూ శాఖ నుంచి ఎన్‌వోసీ జారీ అవుతుంది. అయితే ఇప్పటివరకు ఎన్‌వోసీ జారీ కాకపోవడం గమనార్హం. మరోవైపు ఈ మైదానం చుట్టుపక్కల అనేక ప్రైవేట్ ఆస్పత్రులు ఉన్నాయి. ఏదైనా ప్రమాదం జరిగితే ఇబ్బందికర పరిస్థితులు తలెత్తే అవకాశం లేకపోలేదు. ప్రతీ దుకాణ సమీపంలో రెండు ఫైర్ సేఫ్టీ సిలిండర్లను కలిగి ఉండాలి. అంతేకాకుండా 200 లీటర్ల వాటర్ డ్రమ్ములను ఏర్పాటు చేసుకోవాలి. వీటికి తోడు ఇసుక బకెట్లను అందుబాటులో ఉంచాలి. అయితే సరైన ప్రమాణాలు పాటించకుండానే ఇవి ఏర్పాటు చేశారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

నిబంధనలు తూచ్..

టపాసుల విక్రయాలకు సంబంధించి శాశ్వత అనుమతులు తీసుకొని గోదాములు ఏర్పాటు చేసి అందులో నిల్వ ఉంచి విక్రయాలు చేపడుతారు. ఇవి ఏడాది పాటు నడుస్తూనే ఉంటాయి. పెళ్లిళ్లు, ఇతర కార్యక్రమాలు, ఉత్సవాలు నిర్వహించేందుకు ఇక్కడి నుంచే జనం కొనుగోలు చేస్తారు. జిల్లాలోని జైనథ్ మండలం ఫౌజీపూర్ వద్ద రెండు గోదాములు, ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని అంకోలిలో ఒక గోదాముకు అనుమతులు ఉన్నాయి. వీటికి పెట్రోలియం అండ్ ఎక్స్‌ప్లోజివ్స్ సేఫ్టీఆర్గనైజేషన్(పీఈఎస్‌వో) అనుమతి తీసుకోవాలి. దీని ప్రధాన కార్యాలయం మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఉండగా, రాష్ట్రంలోని హైదరాబాద్‌లో బ్రాంచి కార్యాలయం ఉంది. పదేళ్లకోసారి ఈ అనుమతిని రెన్యూవల్ చేసుకోవాలి. అగ్నిమాపకశాఖ పరంగా ఏటా ఈ గోదాములకు సంబంధించి నిబంధనలు పాటిస్తున్నారా.. లేదా అనేది పరిశీలించాలి. అయితే ఈ పరిశీలన జరగడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

తనిఖీలు చేస్తున్నాం..

టపాసుల విక్రయం కోసం తాత్కాలిక అనుమతులతో ఏర్పాటైన దుకాణాల వద్ద ఫైర్ సేఫ్టీ నిబంధనల విషయంలో తనిఖీ చేస్తున్నాం. ఆదిలాబాద్ రాంలీలా మైదానంలో సోమవారం పరిశీలించాం. నిబంధనలు తప్పనిసరి పాటించాలని స్పష్టం చేశాం.

– సురేశ్, ఇన్‌చార్జి జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి, ఆదిలాబాద్


ఇవేం డిప్యూటేషన్లు!?

- దొడ్డిదారిన తెచ్చుకున్న ఇద్దరు టీచర్లు..?
- ఒకరి రిలీవ్.. మరొకరికి హెచ్‌ఎం నిరాకరణ
- నిబంధనలకు విరుద్ధంగా డీఎస్‌ఈ నుంచి ఉత్తర్వులు
- స్వార్థ ప్రయోజనాల కోసమేనని ఆరోపణలు



PROCEEDINGS OF THE DIRECTOR, SCHOOL EDUCATION, TELANGANA, HYDERABAD.

ఇంద్రవెల్లి టీచర్ తీసుకొచ్చిన డిప్యూటేషన్ ఆర్డర్ ప్రతి



PROCEEDINGS OF DIRECTOR, SCHOOL EDUCATION TELANGANA : HYDERABAD

బేల టీచర్‌కు సంబంధించిన డిప్యూటేషన్ ఆర్డర్ ప్రతి

ఆదిలాబాద్‌టౌన్: సర్కారు బడుల్లో చదివే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాల్సిన టీచర్లు అక్రమంగా డిప్యూటేషన్లు పొందిన ఘటన జిల్లాలో చోటు చేసుకుంది. ప్రభుత్వ బడుల్లో అసలే ఉపాధ్యాయుల కొరత వేధిస్తుండగా, కొందరు వారి స్వార్థ ప్రయోజనాల కోసం దొడ్డిదారి పడుతున్నారు. జీతం తీసుకుంటున్న చోట పనిచేయాల్సిన వారు అక్కడి విద్యార్థుల భవిష్యత్తును ఆలోచించకుండా తమకు అనుకూలంగా ఉన్న వేరే జిల్లాకు వెళ్లేందుకు అక్రమ మార్గాన్ని ఎంచుకున్నారు. పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ కార్యాలయం నుంచి నేరుగా ఉత్తర్వులు పొంది ఆ శాఖాధికారులపై ఒత్తిడి పెంచడంతో వారిని రిలీవ్ చేయాలని ఆదేశించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అక్రమ డిప్యూటేషన్ పోస్టుల్లో ఉన్న వారిని అప్పుడే సొంత పాఠశాలలకు పంపించేశారు. అయితే కొత్తగా మళ్లీ ఈ తతంగం తెరపైకి రావడంతో ఉపాధ్యాయుల్లో అసహనం వ్యక్తమవుతోంది. నిబంధనలకు విరుద్ధంగా డిప్యూటేషన్లు ఇవ్వడంపై ఆయా సంఘాల నాయకులు మండిపడుతున్నారు. జీవో 317 కింద ఇతర జిల్లాలకు బలవంతంగా బదిలీ చేసిన ఉపాధ్యాయులు తమకు న్యాయం చేయాలని మొరపెట్టుకుంటున్నా కనికరించే వారు కరువయ్యారని వాపోతున్నారు. వారిపై కఠినంగా వ్యవహరిస్తున్న ఉన్నతాధికారులు.. వీరికి ఏ విధంగా డిప్యూటేషన్ ఇచ్చారని ప్రశ్నిస్తున్నారు. కాసులిస్తే ఎంతటి పనైనా చేస్తారని ఆరోపిస్తున్నారు.

ఇద్దరు టీచర్లకు అక్రమ డిప్యూటేషన్లు..

జిల్లాలోని ఇంద్రవెల్లి జెడ్పీఎస్ఎస్‌లో పనిచేస్తున్న ఓ టీచర్‌తో పాటు బేల మండల కేంద్రంలో పనిచేసే మరో టీచర్ అక్రమంగా డిప్యూటేషన్ ఆర్డర్లు తీసుకొచ్చారు. పాఠశాల విద్యా శాఖ డైరెక్టరేట్ నుంచి ఈనెల 23న నేరుగా ఉత్తర్వులు తెచ్చుకొని డీఈవో కార్యాలయంలో సమర్పించారు. అయితే జిల్లా విద్యా శాఖాధికారులు వీరిని రిలీవ్ చేసేందుకు నిరాకరించారు. దీంతో పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ కార్యాలయ ఉన్నతాధికారుల నుంచి అధికారులకు ఫోన్ చేయించి ఒత్తిడి తెచ్చారు.ఈ క్రమంలో వారిని రిలీవ్ చేయాలని అధికారులు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు మౌఖికంగా ఆదేశించారు. కాగా ఇంద్రవెల్లి ప్రధానోపాధ్యాయుడు సదరు టీచర్‌ను రిలీవ్ చేయగా, బేలలో మాత్రం హెచ్‌ఎం ఆ టీచర్‌ను రిలీవ్ చేసేందుకు నిరాకరించారు. ఇంద్రవెల్లిలో పనిచేసే ఓ టీచర్‌ను మెడ్చల్ జిల్లాకు డిప్యూటేషన్ కల్పించారు. బేలలో పనిచేసే మరో టీచర్ నిర్మల్ జిల్లా నర్సాపూర్ మండలానికి డిప్యూటేషన్ ఆర్డర్ తీసుకురాగా, ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అనుమతించలేదు. ఈ పాఠశాలలో 600 మంది విద్యార్థులు ఉండగా, ప్రస్తుతం అక్కడ సబ్జెక్ట్ బోధించే ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. ఒకరిని రిలీవ్ చేస్తే మరొకరికి ఇబ్బంది అవుతుందని.. అధికారులు ఒత్తిడి తెచ్చినప్పటికీ ఆయన నిరాకరించారు. వచ్చే ఏడాది ఒక టీచర్ ఉద్యోగ విరమణ పొందనుండడంతో విద్యార్థుల చదువులకు ఆటంకం ఎదురవుతుందని ముందు చూపుతో ఆ హెచ్‌ఎం నిర్ణయం తీసుకున్నారు. అయితే ఇంద్రవెల్లి మండలంలో ఇదివరకు 1,230 మంది విద్యార్థులుండేది. ప్రస్తుతం 1170 మంది పాఠశాలకు వస్తున్నారని ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. ఇక్కడ తెలుగు, ఇంగ్లిష్, మరాఠీ మీడియంలు అందుబాటులో ఉన్నాయి. అక్కడ ఆ సబ్జెక్ట్ చెప్పే టీచర్లు ఆరుగురు ఉన్నారు. ఇటీవల ఇదే పాఠశాలకు డీఎస్సీలో ఓ ఉపాధ్యాయురాలిని కేటాయించారు. దీంతో ఉపాధ్యాయుల సంఖ్య ఏడుకు పెరిగింది. దీన్ని అదనుగా చేసుకొని సదరు టీచర్ ఉన్నతాధికారులతో డిప్యూటేషన్ ఆర్డర్ తెచ్చుకున్నారని సమాచారం.

సర్దుబాటు చేసేదిపోయి.. డిప్యూటేషన్ ఎలా ఇస్తారు

జిల్లాలోని చాలా ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉంది. అవసరానికి మించి ఉపాధ్యాయులు ఉంటే మండలంలోని ఇతర పాఠశాలలకు సర్దుబాటు చేయాల్సింది పోయి ఇతర జిల్లాల పాఠశాలలకు ఏవిధంగా డిప్యూటేషన్ కేటాయిస్తారని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. డీఎస్సీ కంటే ముందు ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత కారణంగా ఎస్జీటీలను ఉన్నత పాఠశాలల్లో బోధించేందుకు కేటాయించారు. ఇప్పటికీ జిల్లాలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉంది. దీంతో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందని పరిస్థితి. ఈ తరుణంలో అక్రమ డిప్యూటేషన్లపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. విద్యార్థుల తల్లిదండ్రులు సైతం మండిపడుతున్నారు. అక్రమ డిప్యూటేషన్లు రద్దు చేయాలని లేకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు..

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డిప్యూటేషన్ కల్పిస్తూ ఇంద్రవెల్లిలో పనిచేస్తున్న టీచర్‌ను రిలీవ్ చేశాం. పాఠశాల విద్యా శాఖ డైరెక్టరేట్ నుంచి ఉత్తర్వులు తీసుకురావడంతో నిర్ణయం తీసుకున్నాం. మరొకరు ఆన్ డ్యూటీ ఆర్డర్ ఉన్నప్పటికీ అక్కడ ఉపాధ్యాయుల సంఖ్య తక్కువగా ఉండడంతో రిలీవ్ చేయలేదు.

– ప్రణీత, డీఈవో

అధికారుల ఆదేశాలతో రిలీవ్ చేశా..

మా పాఠశాలలో పనిచేసే టీచర్ ఆన్‌డ్యూటీ పేరిట రాష్ట్ర విద్యా శాఖ నుంచి ఉత్తర్వులు తీసుకొచ్చారు. జిల్లా విద్యాశాఖాధికారుల ఆదేశాల మేరకు సదరు టీచర్‌ను రిలీవ్ చేయాల్సి వచ్చింది.

– రాంమోహన్, ప్రధానోపాధ్యాయుడు, ఇంద్రవెల్లి

విద్యార్థులు నష్టపోతారని రిలీవ్ చేయలేదు..

మా పాఠశాలలో 600 మంది విద్యార్థులున్నారు. సాంఘిక శాస్త్రం బోధించేవారు ఇద్దరున్నారు. విద్యా శాఖాధికారులు డిప్యూటేషన్‌పై సదరు టీచర్‌ను నిర్మల్ జిల్లాకు రిలీవ్ చేయాలని సూచించినా నిరాకరించాను. ఆ టీచర్‌ను రిలీవ్ చేస్తే విద్యార్థులు నష్టపోవాల్సి వస్తుంది.

– కోల నర్సింలు, ప్రధానోపాధ్యాయుడు, బేల

తేమ పేరిట రైతులను మోసం చేయొద్దు

ఆదిలాబాద్‌టౌన్: తేమ పేరిట రైతులను మోసం చేయొద్దని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో గల పత్తి పంటను సోమవారం పరిశీలించారు. తేమ శాతానికి సంబంధించిన అంశాలను శాస్త్రవేత్తల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఆర్గానిక్ పత్తిలోని పలు అంశాలను శాస్త్రవేత్తలు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో రైతులకు కనీస మద్దతు ధర లభించడం లేదన్నారు. గుజరాత్‌లో పత్తి క్వింటాలుకు రూ.8వేలు పలికితే, తెలంగాణలో ఆ ధర లభించడం లేదని తెలిపారు. జిల్లా రైతు నాయకులు, ఆదర్శ రైతులను గుజరాత్ పర్యటనకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. పత్తి రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని తెలియజేస్తామని అన్నారు. ఆయన వెంట శాస్త్రవేత్తలు రాంప్రసాద్, రాజేందర్, ప్రవీణ్, రఘునాథ్, బీఆర్ఎస్ నాయకులు మనోహర్, తన్వీర్ తదితరులున్నారు.



పత్తి పంటను పరిశీలిస్తున్న జోగు రామన్న

క్లుప్తంగా

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్ట్



నిందితుల అరెస్టు చూపిస్తున్న ఎస్సై

కాసిపేట: గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న కోమటిచేనుకు చెందిన జాడి దిలీప్, జాడి మొగిలి, మంచిర్యాలకు చెందిన రాంటెంకి మధుకర్‌ను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 90 గ్రాముల గంజాయి, స్కూటీ, రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

స్వర్ణ ప్రాజెక్టులో పడి వ్యక్తి మృతి



మర్రి పెద్ద లింగన్న మృతదేహం

సారంగపూర్(నిర్మల్): ప్రమాదవశాత్తు స్వర్ణ ప్రాజెక్టులోపడి వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మండలంలోని జౌళి గ్రామానికి చెందిన మర్రి పెద్ద లింగన్న (31) ఆదివారం తన కుల వృత్తిలో భాగంగా బట్టలు ఉతికేందుకు ప్రాజెక్టు వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో ఫిట్స్ రావడంతో నీటిలో మునిగి ఊపిరాడక మృతి చెందాడు. సోమవారం ప్రాజెక్టు గేట్ల వద్ద మృతదేహం గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుని భార్య సురేఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు ..

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన షేక్ ఇమ్రాన్(33) రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. మేస్త్రీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్న ఇమ్రాన్ హైడ్రోసిల్‌తో బాధపడుతున్నాడు. ఆపరేషన్ చేయించుకోవాల్సి ఉండగా ఆర్థికంగా ఇబ్బందుల నేపథ్యంలో ఆదివారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు రిమ్స్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు.

'మహా' ఎన్నికల్లో పేకాట డబ్బు

- తెలంగాణ నిర్వాహకుల భారీ విరాళాలు
- సరిహద్దు గ్రామాల్లో క్లబ్ పేరుతో పత్తాలాట
- మహారాష్ట్ర ఎన్నికల కోడ్‌లోనూ యథేచ్ఛగా దందా
- అక్కడ అందర్ని మేనేజ్ చేస్తూ రూ.కోట్లలో ఆర్జన



మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దు రాజురా తాలూకా సోనూర్లి స్పోర్ట్స్ క్లబ్‌లో పేకాట (ఫైల్)

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పేకాట హద్దులు దాటింది. తెలంగాణలో నిషేధం అమలుతో నిర్వాహకులు మహారాష్ట్ర సరిహద్దులకు మకాం మార్చారు. ప్రస్తుతం ఆ రాష్ట్ర శాసనసభ ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు చేస్తున్నా ఈ దందాకు ఎవరూ అడ్డు చెప్పడం లేదు. ఎన్నికల కోడ్‌లోనూ యథేచ్ఛగా పేకాట క్లబ్‌లు నడుస్తున్నాయి. అక్కడి పలు రాజకీయ పార్టీల అభ్యర్థులకు పెద్ద మొత్తంలో డబ్బును విరాళాలుగా ఇవ్వడంతో అంతా 'మామూలు'గానే సాగుతోందనే ఆరోపణలు ఉన్నాయి. స్పోర్ట్స్ క్లబ్ సొసైటీ పేరుతో నిత్యం రూ.లక్షల లావాదేవీలు అనధికారికంగా నడుస్తున్నాయి. చట్టప్రకారం డబ్బులు పెట్టి ఆడే జూదంపై నిషేధం అమలులో ఉంది. పొరుగు రాష్ట్రంలో చట్టబద్ధమని ప్రచారం చేస్తూ క్లబ్‌ల మాటున పేకాట ఆడిస్తున్నారు. వాస్తవానికి ఈ క్లబ్బుల్లో ఇండోర్ గేమ్స్ క్యారం, చెస్, టెన్నిస్, స్నూకర్, తదితర ఆటలకు మాత్రమే అనుమతి ఉంది. అది కూడా సొసైటీ సభ్యులకు మాత్రమే. కానీ పొరుగు రాష్ట్రంలోనూ తెలంగాణకు చెందిన వ్యసనపరులతో ఆడిస్తూ డబ్బులు దండుకుంటున్నారు.

ఆడించేది, ఆడేది మన వాళ్లే..

ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో స్పోర్ట్స్ పేరుతో పేకాట క్లబ్‌లు ఉన్నాయి. ఒక్కో రోజుకు రూ.లక్షల్లో ఆదాయం వస్తుండడంతో అన్ని దశల్లోనూ మేనేజ్ చేస్తున్నారు. నిత్యం తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రా ప్రాంతాల నుంచి వందల కిలోమీటర్ల దూరం నుంచి ఫంటర్లు(పేకాట ఆడేవారు)ను రప్పించి ఆడిస్తున్నారు. ఇందుకు కారు డ్రైవర్లనే ఏజెంట్లుగా నియమించుకుని కమీషన్లు ఇస్తూ వందలాది మందిని సరిహద్దులకు తరలిస్తున్నారు. సీసీ కెమెరాలు, ఏసీ గదులు, భోజనం, రవాణా ఖర్చులు, అవసరమైతే అప్పు కూడా ఇస్తూ ఈ వ్యసనంలో ముంచేస్తున్నారు. గతంలో మహారాష్ట్ర, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల సరిహద్దుల్లో ఈ క్లబ్‌లను కట్టడి చేశారు. నాందేడ్, లాతూరు, యావత్మాల్, చంద్రాపూర్ జిల్లాల్లో తెలంగాణ వారే నిర్వహించారు. పోలీసుల దాడులతో తగ్గిపోయాయి. మళ్లీ కొందరు మొదలు పెట్టారు. జూదంలో ఆరితేరిన పెద్దపల్లి జిల్లా ఎస్టీపీసీ మాజీ ఉద్యోగి, మంచిర్యాలకు చెందిన ఓ ఫైనాన్షియర్, బార్ యాజమాని కలసి రూ.కోట్లలో పెట్టుబడి పెట్టి ఈ దందా నడిపిస్తున్నారు.

నెలకు రూ.కోట్లలో ఆర్జన

ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం పెన్‌గంగా అవతలి వైపు జాతీయ రహదారి పక్కనే యావత్మాల్ జిల్లా పటాన్ బోరిలో ఓ క్లబ్ నడుస్తోంది. నిత్యం ఇక్కడికి 50మంది దాకా వచ్చి పేకాట ఆడుతున్నారు. చంద్రాపూర్ జిల్లా రాజురా తాలూకా సోనూర్లిలో వంద మందికిపైగా జూదరులు వెళ్తున్నారు. రమ్మీ, అందర్‌బహర్, తీన్‌పత్తా, కట్‌పత్తా ఆడిస్తూ వ్యసనపరుల జేబులు గుల్లా చేస్తున్నారు. కనీసం రూ.5వేల నుంచి రూ.50వేల దాకా డబ్బులు పెట్టి ఆడుతూ నిర్వాహకుల పంట పండిస్తున్నారు. గూగుల్‌పే, ఫోన్ పేతోపాటు నగదు రూపంలో పెట్టుబడి పెట్టి ఆడుతున్నారు. ఒక్కో టేబుల్‌కు పది శాతం కమీషన్ నిర్వాహకులు తీసుకుంటున్నారు. ఇందులో పెద్ద మొత్తంలో అక్కడి అధికార యంత్రాగానికి, రాజకీయ, ప్రజాప్రతినిధులకు ఇస్తూ మేనేజ్ చేస్తున్నారు. దీంతో ఎన్నికల వేళ సరిహద్దు గ్రామాలకు వందల కొద్దీ వాహనాల రాకపోకలు ఉన్నా చెక్‌పోస్టుల్లోనూ ఎవరూ పట్టించుకోవడం లేదు.

కుటుంబాలు ఛిన్నాభిన్నం

జూదరుల్లో వ్యాపారులు, రియల్టర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, టీచర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నారు. వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి ఎక్కువగా వెళ్తున్నారు. గతంలో పొరుగు రాష్ట్రంలో క్లబ్‌కు వెళ్లే వారిపై సరిహద్దుల జిల్లాల్లో తనిఖీలు, దాడులు చేయడంతో తగ్గిపోయాయి. అయితే మళ్లీ గత కొంతకాలంగా యథావిధిగా నడుస్తున్నాయి. ఆటలో రూ.లక్షలు సంపాదిస్తామని ఆశతో వెళ్లి, అప్పుల పాలై వస్తున్నారు. దీంతో కుటుంబాల్లో ఆర్థికంగా చిన్నభిన్నం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దు మండలాల పోలీసుస్టేషన్లలో మళ్లీ తనిఖీలు విస్తృతం చేసి ఈ అక్రమ దందాను ఆపేయాలని బాధిత కుటుంబీకులు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతంపై దృష్టి

- నేడు హైదరాబాద్‌లో ఎంఈవోలకు శిక్షణ
- ఉమ్మడి జిల్లా నుంచి 70 మంది హాజరు



విద్యార్థులతో చదివిస్తున్న ఎంఈవో ఆడే ప్రకాశ్

కెరమెరి(ఆసిఫాబాద్): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పాఠశాల బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించింది. విద్యాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తోంది. కొన్నేళ్లుగా మండల విద్యాధికారులు లేకపోవడంతో బడుల పర్యవేక్షణ గాడితప్పింది. ఉన్నవారికి నాలుగేసి మండలాల చొప్పున ఇన్‌చార్జీ బాధ్యతలతో కొనసాగింది. దీంతో విద్యాప్రమాణాలు పూర్తిస్థాయిలో పడిపోయాయి. ఈ నేపథ్యంలో మండలంలోని సీనియర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులను ఎంఎన్‌వోగా నియమించింది. కానీ అనుకున్న స్థాయిలో ఫలితాలు సాధించలేకపోయింది. దీంతో చేసేదేం లేక ఎంఎన్‌వోలను ఇన్‌చార్జి మండల విద్యాధికారులుగా నియమించింది.

నేడు హైదరాబాద్‌లో శిక్షణ

హైదరాబాద్‌లోని సేవాలాల్ బంజారా భవన్‌లో మంగళవారం ఎంఈవోలకు శిక్షణ ఇవ్వనున్నారు. ఉదయం 9:30 గంటల నుంచి ప్రారంభమయ్యే శిక్షణకు ఉమ్మడి జిల్లా నుంచి 70 మంది ఎంఈవోలు హాజరు కానున్నారు.వారిలో ఆదిలా బాద్ జిల్లా నుంచి 18 మంది, కుమురం భీం ను ంచి 15 మంది, నిర్మల్ నుంచి 19 మంది, మంచి ర్యాల జిల్లా నుంచి 18 మంది పాల్గొననున్నారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అందరూ హాజరయ్యేలా చూడాలని జిల్లా విద్యాధికారులను ఆదేశించారు.

వీటిపైనే శిక్షణ

ప్రాథమిక పాఠశాలల్లో 1 నుంచి ఐదోతరగతి వరకు చదువుతున్న విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెంపొందించేందుకు ప్రభుత్వం ఎఫ్ఎల్ఎన్ (ఫండమెంటల్, లిటరసీ, న్యూమరసీ) కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఉన్నత పాఠశాలలో 6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు అభ్యసనాభివృద్ధి కార్యక్రమం (లిప్)ను ఉన్నతి పేరుతో అమలు చేస్తోంది. పదోతరగతి విద్యార్థులు ఉత్తీర్ణతను పెంపొందించేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాలు పాఠశాల స్థాయిలో సక్రమంగా అమలవుతున్నాయా లేదా అనే విషయాన్ని ఎంఈవోలు గ్రహించాల్సి ఉంది. పర్యవేక్షణ వివరాలను పాఠశాల విద్యాశాఖ యాప్‌లో నమోదు చేయడంతో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. గతంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం, మండల నోడల్ అధికారి, మండల విద్యాధికారి వ్యవస్థ అమల్లో ఉండేది. గతంలో ఒక్కో ఎంఈవోకు నాలుగు, ఐదేసి మండలాల అదనపు బాధ్యతలు ఉండడంతో పర్యవేక్షణ సరిగా చేయలేకపోయారు. ఎంఎన్‌వోలుగా పనిచేస్తున్న సీనియర్ జీహెచ్‌ఎంలను ఎంఈవోలుగా నియమించారు. పాఠశాలల పర్యవేక్షణ, విద్యాప్రమాణాల పెంపుదల, పరిపాలన విధానం, తదితర అంశాలపై ఎంఈవోలకు ఈ శిక్షణ కొనసాగనుంది. దీంతో రానున్న రోజుల్లో బడులు మరింత బలోపేతం అయ్యే అవకాశాలు లేకపోలేదు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూగుప్తా



అర్జీలు స్వీకరిస్తున్న పీవో ఖుష్బూగుప్తా

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూగుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలనుంచి అర్జీలు స్వీకరించారు. ఉట్నూర్ మండలం దంతన్‌పల్లికి చెందిన రామస్వామి పింఛన్ ఇప్పించాలని, జన్నారం మండలం మురిమడుగుకు చెందిన రాహుల్ వికాసం పాఠశాలలో అడ్మిషన్ ఇప్పించాలని, తిర్యాణి మండలం మొర్రిగూడకు చెందిన టేకం రాజు ఎడ్లజత మంజూరు చేయించాలని, సిర్పూర్(యూ) మండలం మెలిగూడకు చెందిన భువనేశ్వరి ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు. ఇంకా పింఛన్, డబుల్ బెడ్రూం ఇళ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయం, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమంలో ఏపీవో వసంత్‌రావు, ఏవో దామోదర్, జేడీఎం నాగభూషణం, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నమ్మించి మోసగించిన ఇద్దరి అరెస్ట్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ రవీందర్

చెన్నూర్: సిమెంట్ కంపనీ ఏజెంట్లమని చెప్పి నమ్మించి మోసగించిన ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రవీందర్ తెలిపారు. సోమవారం పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలో ఇంటి నిర్మాణం చేపడుతున్న కొత్తపల్లి విష్ణుమూర్తి వద్దకు ఈ నెల 24న రంగారెడ్డి, రేగడిగణపూర్ గ్రామానికి చెందిన వడ్డె విక్రమ్, వడ్డె మల్లేశ్ వచ్చి తాము అల్ట్రాటెక్ సిమెంట్ కంపనీ ఏజెంట్లమని, రూ.275లకే సిమెంట్ బస్తాలు సరఫరా చేస్తామని నమ్మించారు. వారి మాటలు నమ్మిన విష్ణుమూర్తి సిమెంట్ బస్తాలు కావాలని చెప్పడంతో ఈనెల 25న సదరు నకిలీ ఏజెంట్లు పట్టణంలోని ఆస్నాద రోడ్డులో ఉన్న ఎస్ఆర్ఎస్ ఏజెన్సీ యజమాని అయిత సురేష్‌కు ఫోన్‌చేసి 120 సిమెంట్ బస్తాలు పంపించమని చెప్పారు. సదరు యాజమాని బస్తాలు పంపించడంతో విక్రమ్, మల్లేశ్ విష్ణుమూర్తికి ఫోన్‌చేసి సిమెంట్ లోడ్ వచ్చింది రూ.33 వేలు ఫోన్ పే చేయమని చెప్పడంతో వెంటనే మనీ ట్రాన్స్‌ఫర్ చేశాడు. సిమెంట్ బస్తాలు అన్‌లోడ్ చేసిన కార్మికులు డబ్బులు చెల్లించాలని అడుగగా మీ యజమానికి ఫోన్ పే చేశానని చెప్పాడు. సదరు ఏజెన్సీ యజమాని డబ్బులు రాలేదని చెప్పడంతో నకిలీ ఏజెంట్ల చేతిలో మోసపోయానని గమనించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను అరెస్టుచేసి వారి వద్ద నుంచి రూ.33 వేల నగదు, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

2 నుంచి బాసరలో కార్తీక పూజలు



బాసర అమ్మవారు..

బాసర : బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి క్షేత్రంలో కార్తీకమాస పూజలు నవంబర్ 2 నుంచి డిసెంబర్ 1 వరకు నిర్వహిస్తామని ఆలయ ఈవో తెలిపారు. నెలరోజులు సరస్వతీ అమ్మవారి ఆలయంతోపాటు గోదావరి నది ఒడ్డున ఉన్న శివాలయంలో విశేష పూజలు నిర్వహిస్తామని వెల్లడించారు. ప్రతీరోజు సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు అమ్మవారి ఆలయంలో మహిళా భక్తులతో దీపోత్సవం ఉంటుందన్నారు. నిత్యం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రతీ సోమవారం గోదావరినది వద్ద ఉన్న సూర్యేశ్వర ఆలయంలో ఉదయం 9 గంటలకు ఏకాదశ రుద్రాభిషేకం, అన్నపూజ, . గోదావరి హారతి, తోరణం ఉంటాయని వివరించారు. కార్తీక పౌర్ణమి సందర్భముగా శుక్రవారం పార్థివలింగ పూజ, గోదావరి హారతి. రుద్రాత్రిషతి నామార్చన, సామూహిక సత్యనారాయణ వ్రతం, భస్మ అభిషేకం, హారతి పూజలు ఉంటాయని వివరించారు.

అవినీతికి వ్యతిరేకంగా పోరాడాలి



నస్పూర్: ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జీఎం సంజీవరెడ్డి

నస్పూర్: సంస్థలో పనిచేస్తున్న ప్రతీ ఉద్యోగి అవినీతికి వ్యతిరేకంగా పోరాడాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి అన్నారు. సోమవారం జీఎం కార్యాలయంలో సింగరేణి విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జీఎం మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి నవంబర్ 3 వరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ, అధికారులు మురళీధర్, అరవిందరావు, చిరంజీవులు, వెంకటేశం, శిరీష రెడ్డి, చంద్రమణి, చంద్రశేఖర్, హనుమాన్‌గౌడ్, కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: ఏరియా జీఎం కార్యాలయ ఆవరణలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇన్‌చార్జి జీఎం రాజేశ్వరరెడ్డి ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యామ్‌సుందర్, ఐఈడీ రాజన్న, డీవైపీఎం ఆసిఫ్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక




ఎంపికైన విద్యార్థులతో చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి

జన్నారం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, 17 విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో జన్నారం మండలంలోని స్లేట్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈనెల 27న మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తరపున బాస్కెట్ బాల్ పోటీల్లో పాల్గొన్న ఏడుగురు విద్యార్థులు ఎంపికైనట్లు విద్యాసంస్థల చైర్మన్ ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఎంపికై న విద్యార్థులను అభినందించారు.

5న చెస్ పోటీలు

మందమర్రిరూరల్: పట్టణంలోని బురుదగూడెంలో గల లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో నవంబర్ 5న అండర్14, 17 బాలబాలికల చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా చైర్మన్ ఈగ కనుకయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనేవారు బోనోఫైడ్, ఆధార్ కార్డు వెంట తీసుకుని రావాలని, మరిన్ని వివరాలకు 8978146456 నంబరులో సంప్రదించాలని సూచించారు.

హైకోర్టు ఆదేశంతో సర్టిఫికెట్లు అందజేత



సర్టిఫికెట్లతో ఫణికుమార్

భైంసా(ముధోల్): బాసర ట్రిపుల్‌ఐటీ పూర్వ వి ద్యార్థి సామల ఫణికుమార్‌కు క్యాంపస్ అధి కారులు సోమవారం ఒరిజినల్ సర్టిఫికెట్లు అందజేశారు. సర్టిఫికెట్లు ఇప్పించాలని సదరు వి ద్యార్థి ఇటీవలే హైకోర్టులో కేసు వేయడంతో ఫీ జు చెల్లించలేదని ఏ విద్యార్థికి సర్టిఫికెట్లు ఆపకూడదని కోర్టు ఆదేశించింది. దీంతో సోమవా రం నల్గొండ జిల్లా గట్టుప్పల్ మండలం తేరటుపల్లి నుంచి ఫణి కుమార్ బాసర క్యాంపస్‌కు వచ్చి అధికారులను కలవడంతో సర్టిఫికెట్లు ఇ చ్చారు. 2023లోనే మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన ఈ విద్యార్థి ఏడాదిన్నరకాలంగా సర్టిఫికెట్ల కోసం క్యాంపస్ చుట్టూ తిరుగుతున్నాడు.

బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి జైలు

కడెం: గుడుంబా కేసులో పట్టుబడి బైండోవర్ ఉల్లంఘించిన మండలంలోని కొత్తమద్దిపడగకు చెందిన తిరువెల్లి సత్తెన్నను ఆదిలాబాద్ జైలుకు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మణ్‌రావు తెలిపారు. నిందితుడు గతంలో గుడుంబా విక్రయిస్తూ పట్టుబడడంతో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. మళ్లీ గుడుంబా విక్రయిస్తూ పట్టుబడడంతో తహసీల్దార్ సుజాత ఆదేశాల మేరకు సోమవారం ఆదిలాబాద్ జైలుకు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

జోనల్‌స్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

లక్ష్మణచాంద(నిర్మల్): మండలంలోని వడ్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అండర్-17 బాలికల జోనల్ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి అశోక్ వర్మ, మాజీ వైస్ ఎంపీపీ కల్పనారెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి రవీందర్ గౌడ్, హెచ్‌ఎం రాజు నాయక్ పాల్గొన్నారు.

ఎంపికైన ఉమ్మడి జిల్లా జట్టు

బి.సోనాలి, పి.అంజలి, అనూష (ఆదిలాబాద్), వి.సాత్విక, సాయిదీక్ష, గాయత్రి(ఆసిఫాబాద్), పి.హరిప్రియ, సరయు, టీ.అమూల్య, ఈజి.శ్రావణి, టీ.మనీషా, పి.లాస్య(నిర్మల్), ఎస్.శ్రీజ, నిరిక్ష, శృతి(మంచిర్యాల) ఎంపికయ్యారు.

కూల్చివేతలు అంతంత మాత్రమేనా?



పెద్దనపల్లి శివారు బ్రిడ్జిపై తొలగించిన గోడ , మట్టి

కాసిపేట:మండలంలోని పెద్దనపల్లి శివారులో వాగుపై అక్రమంగా నిర్మించిన బ్రిడ్జి వివాదాస్పదం కావడంతో అధికారులు స్పందించి బ్రిడ్జి కూలగొట్టేందుకు నోటీసులు ఇచ్చామని ప్రకటించి ఆదివారం కూలగొట్టినట్లు తెలిపారు. కాగా బ్రిడ్జిపై ఉన్న ఇటుకలతో నిర్మించిన గోడ బ్రిడ్జిపై పోసిన మట్టిని నామమాత్రంగా తొలగించినట్లు విమర్శలున్నాయి. ఈ విషయమై డీఈ నారాయణను వివరణ కోరగా ప్రస్తుతం జేసీబీతో బ్రిడ్జిపై గోడలు, మట్టి తొలగించడం జరిగిందని, కాంక్రీట్ నిర్మాణం తొలగించేందుకు మరో భారీ యంత్రాన్ని సమకూర్చుకునేందుకు సమయం కావాలని కోరడంతో ప్రస్తుతం ఆపివేసినట్లు తెలిపారు.

రిటైర్డ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నస్పూర్: సింగరేణి రిటైర్డ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని పోచారం టాస్కా(తెలంగాణ ఆల్ స్టేట్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్) కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ పెన్షన్ పెంపు, సొంత ఇంటి నిర్మాణానికి 200 గజాల స్థలం, తెల్ల రేషన్ కార్డులు మంజూరు వంటి సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణుమాధవ్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులు కొట్టె మల్లయ్య, లక్ష్మీనారాయణ, నాయకులు ప్రభాకర్, నర్సయ్య, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



మోహిజ్ (ఫైల్)

వేమనపల్లి/బెజ్జూర్: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలంలోని సోమిని వద్ద గల ఎర్రబండ ప్రాణహిత నదిలో శనివారం ముగ్గురు యువకులు గల్లంతైన విషయం తెలిసిందే. ఆదివారం రెండు మృతదేహాలను పోలీసులు వెలికి తీశారు. సోమవారం గాలింపు చర్యలు చేపట్టగా దిగువన 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండల కేంద్రానికి సమీపంలోని రాచర్ల-వెంచపల్లి ఘాట్ సమీపంలో మోహిజ్ (19) మృతదేహం లభ్యమైంది. స్థానిక జాలర్లు, బోట్ రైడర్లు నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్‌కు సమాచారం అందించారు. ఆయన బెజ్జూర్ ఎస్సై విక్రమ్‌ను పిలిపించడంతో మోహిజ్ మృతదేహంగా ధ్రువీకరించారు. దీంతో మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ విషయమై ఎస్సై విక్రమ్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

మద్యానికి బానిసై ఆత్మహత్య



సురేష్ (ఫైల్)

సోన్(నిర్మల్): మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండంలోని సాకెరలో చోటు చేసుకుంది. ఏఎస్సై షేక్ హైమద్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సురేష్ (39) మద్యానికి బానిసై ఖాళీగా తిరుగుతున్నాడు. ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో మద్యం మత్తులో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి ..

బెల్లంపల్లి: బెల్లంపల్లి రైల్వేస్టేషన్ శివారు ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం వెలుగు చూసింది. టూటౌన్ ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం చెట్ల పొదల్లోకి వెళ్లిన గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి సుమారు 30 నుంచి 35 ఏళ్ల మధ్య ఉంటుంది. బ్లాకలర్ టీషర్టు, బ్రౌన్ కలర్ నైట్‌ప్యాంటు ధరించి ఉన్నాడు. ఆచూకీ తెలిసినవారు 8712656562, 9908761617 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక డంప్‌లు సీజ్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో అక్రమంగా నిల్వ ఉంచిన 60 ట్రాక్టర్ల ఇసుక డంప్‌లను రెవెన్యూ, మైనింగ్ అధికారులు సోమవారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆర్ఐ అజీజ్ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంప్‌లను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీజ్ చేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మట్కా ఆడుతున్న ఇద్దరి అరెస్ట్

ఇచ్చోడ(బోథ్): మండల కేంద్రంలోని పశువుల సంత సమీపంలో సోమవారం మట్కా ఆడుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించిన మట్కా ఆడుతున్న షేక్ హరీష్, జాదవ్ అశోక్‌ను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.14,500 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.